క్లుప్తంగా

చిరు ధాన్య విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న డీపీఎం షణ్ముగం

చిట్టమూరు : మండలంలోని ఎల్లసిరి గ్రామానికి చెందిన రైతులకు శుక్రవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం చిరు ధాన్య విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎల్లసిరి ఎగువ గిరిజన కాలనీలో స్టాల్ ప్రారంభించి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుతోపాటు అమ్మకాలు చేపడతామన్నారు. పీఎండీఎస్(ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్) ద్వారా 25 రకాల విత్తనాలు 20 కేజీల కిట్లను 150 మంది రైతులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఎస్ఎఫ్ఏ నీలమ్మ, చిట్టమూరు మండల ఇన్‌చార్జి ధనమ్మ, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

పొలానికి కంచెగా చీరలు



చిల్లమూరులో పంట చుట్టూ కట్టిన చీరలు

చిట్టమూరు : మండలంలోని చిల్లమూరు, రామాపురం, మొలకలపూడి గ్రామాల్లోని రైతులు మెట్ట ప్రాంతాల్లో బావి నీరు ఆధారంగా మిరప పంట సాగు చేస్తున్నారు. పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు చుట్టూ పాత చీరలు కట్టారు. వీటిని చూసి ఆ రోడ్డు గుండా వెళ్లే వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కోట : ఎస్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆలిండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని చిట్టేడు ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, కోటలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, సుధాకర్, వెంకటరమణ, ప్రిన్సిపాల్ శుభకర్‌రావు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

దక్కిలి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని దక్కిలి జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ డి.వెంకటరమణారెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం పిల్లలకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రబల్లిలో మెగా కంటి వైద్య శిబిరం



రోగులకు అద్దాలు అందజేస్తున్న వైద్యులు

కలువాయి: గ్లోకోమా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎర్రబల్లిలో రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆప్తమాలజీ వైద్యులు ఎన్ఎన్.శైలజ ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. ఉయ్యాలపల్లి, కోటూరుపల్లి, ఎర్రబల్లి గ్రామాలకు చెందిన 40 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 13 మందికి నెల్లూరులో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ చైర్మన్ జి.పెంచలపుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యాలపల్లి సర్పంచ్ పుల్లే పరదేశి, ఆశా వర్కర్లు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

కండలేరులో 50.441 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 50.441 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 550, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 130, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

స్వర్ణముఖి నదికి తూట్లు

కూటమి నేతలు అధికారం అండతో ప్రకృతి సంపదను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డీసిల్టింగ్ మాటున స్వర్ణముఖినదిలోకి గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసుకుని మరీ భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. లారీలతో ఇసుకను చెన్నైకి తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు, పాలకులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పెద్ద ఎత్తున ఇసుక తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.



- డీసిల్టింగ్ మాటున ఇసుక దోపిడీ
- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- అండగా నిలుస్తున్న అధికార పార్టీ నేతలు
- కలవకూరు టూ చెన్నైకి ఇసుక రవాణా

పెళ్లకూరు : మండల కేంద్రమైన పెళ్లకూరుకు కూతవేటు దూరంలో ఉన్న కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిలో డీసిల్టింగ్ చేయడానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ క్రమంలో పుల్లూరు గ్రామ సమీపంలోని పాలచ్చూరు సప్లయి చానల్ వద్ద 1.92 హెక్టార్లు, దిగువ కలవకూరు వద్ద 1.821 హెక్టార్లలోని స్వర్ణముఖినదిలో పైపొరను రోజువారి కూలీలతో తవ్వకాలు చేపట్టి అవసరాల నిమిత్తం ఇసుకను తీసుకెళ్లేందుకు డీఎల్ఎస్సీ జిల్లా అధికారులు అనుమతులు మంజూరు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ కూటమి నేతల అండతో ఆయా శాఖల అధికారులకు తాయిలాలు ఇచ్చి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్వర్ణముఖినదిలోకి లారీలు, టిప్పర్లు రాకపోకల కోసం గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వి లారీలతో చెన్నైకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తరలింపులపై ప్రశ్నించే స్థానిక రైతులను అధికారుల అండతో భయపెడుతున్నారు. పైగా నదుల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడితే ఉపేక్షించేది లేదని కూటమి నేతలు బహిరంగ సమావేశాల్లో శ్రీరంగ నీతులు చెబుతున్నారు.



చెన్నైకి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ

తాగు, సాగునీటికి తప్పని కష్టాలు..

స్వర్ణముఖినది ఆధారంగా చేసుకుని ఇరువైపులా 10 వేల ఎకరాలకు పైగా భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. అలాగే పలు బోర్లు వేసి 20 గ్రామాల ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు వ్యాపారులకు సహకరిస్తుండడం వల్ల వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారు. రైతులు వాహనాలను అడ్డుకున్నప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం.

గత ప్రభుత్వంలో ఇసుకరీచ్‌లు రద్దు..

2019–24లో కలవకూరు, కప్పగుంటకండ్రిగ, తాళ్వాయిపాడు గ్రామాల్లో ఇసుక రీచ్‌లను మంజూరు చేసింది. దీన్ని వైఎస్సార్ సీపీ నేతలు వ్యతిరేకించడంతోపాటు ఇసుక రీచ్‌లు రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. రైతులు, ప్రజల సౌకర్యార్థం ఇసుక రీచ్‌లను అప్పటి జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం కూటమి నేతలు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.



[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1	Bid Document Fee	Rs.10,000/- + GST 18%=11,800/- through DD in favor of sand account 2024 Tirupati	Rs.10,000/- +GST 18%=11,800/- through DD in favor of sand account 2024 Tirupati	Rs.10,000/- +GST 18%=11,800/- through DD in favor of sand account 2024 Tirupati
2	EMD	Rs.5,53,000/- in favor of sand account 2024 Tirupati	Rs.5,82,836/- in favor of sand account 2024 Tirupati	Rs.7,22,925/- in favor of sand account 2024 Tirupati
3	Schedule Sale Opening Date	22-11-2024 at 11.00 A.M		
4	Schedule Sale Closing Date	29-11-2024 at 3.00 P.M		
5	Bid Submission Closing Date	29-11-2024 at 5.00 P.M		
6	Technical Bid Opening Date	30-11-2024 at 11.00 A.M		
7	Price Bid Opening Date	30-11-2024 at 03.00 P.M		

సం/- జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, తిరుపతి జిల్లా.

ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ఇచ్చిన జీవో

పరిశీలించి చర్యలు తీసుకుంటాము

స్వర్ణముఖి నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టడం చట్ట విరుద్ధం. నిబంధనల మేరకు కూలీలతో ఇసుక తవ్వి స్థానికుల అవసరాలకు వినియోగించుకోవాలి. యంత్రాలతో తవ్వకాలు చేపట్టే విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటాము.

– శ్రీనివాసరావు, ఏడీ మైనింగ్

ఉపాధిలో అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సైదాపురం : మండలంలోని రాగనరామాపురం పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయని సర్పంచ్ ఉసా నరసమ్మ ఆరోపించారు. ఆమె శుక్రవారం నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ రాగనరామాపురం గ్రామ పంచాయతీలో 2024–25లో 100 రోజులు పనిదినాలు పూర్తి కావడంతో ఆ గ్రామానికి చెందిన సీనియర్ మేట్ పలు జాబ్‌కార్డులను తొలగించారని తెలిపారు. వారికి సంబంధించిన కొంత మందికి కొత్తగా ఆపేర్లతోనే జాబ్ కార్డులు మళ్లీ ఇచ్చారని వెల్లడించారు. తద్వారా వారికి మరో 100 రోజులు పనిదినాలు కల్పించి మోసం చేశారని తెలిపారు. ఆ జాబ్ కార్డులు పొందిన వారిలో ఇద్దరు ప్రభుత్వ సిబ్బంది కూడా ఉన్నారని ఆరోపించారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలని వినతి

చిల్లకూరు : గూడూరు పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై శనివారం గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి– పొడి చెత్తపై అవగాహన ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. ఇందులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఎన్‌జీవోలు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

50 ఏళ్లుగా ఈ రోడ్డు గుండానే నడుస్తున్నాం

నాయుడుపేట టౌన్ : 50 ఏళ్లుగా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డును వదులుకోమని భూపయ్య కాలనీకి చెందిన గిరిజనులు స్పష్టం చేశారు. కూటమి నేతలు నాయుడుపేటలోని భూపయ్య కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా గోడ కట్టారు. దీనిపై కాలనీ వాసులు సీపీఎం, సీఐటీయూ నాయకులతో కలిసి పలుమార్లు ఆందోళన చేశారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడడంతో గురువారం గోడను తొలగించారు. ఈ నేపథ్యంలో సీఐ బాబి శుక్రవారం భూపయ్య కాలనీకి వెళ్లి విచారించారు. స్థానికులు మాట్లాడుతూ కూటమి నేతలు అధికారులను లోబరుచుకుని గిరిజనులైన తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రోడ్డు అడ్డంగా గోడ కడితే అడ్డుకుంటామని హెచ్చరించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ బాబి

శాస్త్రోక్తంగా చండీ హోమం

చిల్లకూరు : పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గతంలో అమ్మవారికి బలితో కూడిన నైవేద్యం సమర్పించే వారు. రెండేళ్ల నుంచి చండీ హోమం నిర్వహించడం ప్రారంభించారు. హోమానికి ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన అన్నంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఇందిరమ్మ, సురేంద్రరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పాల్గుణ మాసం లక్ష్మీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, పీఠం సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు



హోమం చేస్తున్న వేద పండితులు

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కోట: విద్యానగర్‌లోని శిరిడీ సాయిబాబా మందిరం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయం డాక్టర్లు కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు.

27న జాతీయ సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈ నెల 27న సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరిగ్రాహ్ 2కే25 జాతీయ స్థాయి శాస్త్ర సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో పలు రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పత్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌వోడీ శ్రీనివాస్, సంజయ్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

రాపూరు: ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని రాపూరు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు కండక్టర్లకు హాల్ టికెట్లు చూపించాలని సూచించారు.

మహాజన టీచర్స్ అసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



మహాజన టీచర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : తిరుపతి జిల్లా మహాజన టీచర్స్ అసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్ తెలిపారు. నాయుడుపేటలోని రాజగోపాలపురం పాఠశాలలో శుక్రవారం సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. చేమూరు మస్తాన్ మాట్లాడుతూ మహాజన టీచర్స్ అసోసియేషన్‌కు చెందిన ఉపాధ్యాయులు సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా మహాజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పత్రి వీరరాఘవులు, ప్రధాన కార్యదర్శిగా జడ చలపతి ఎన్నికయ్యారు. అనంతరం ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దూడల పెంచలయ్య, రవి, ప్రపసాద్, పీరయ్య, జ్యోతి శ్రీశైల, 50 మందికి పైగా మాదిగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కోళ్ల వాహనం బోల్తా

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట 71 నంబరు జాతీయ రహదారి రింగ్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున కోళ్ల లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కోళ్లను తీసుకుని టాటా ఏస్ వాహనం తిరుపతి నుంచి గూడూరుకు వెళుతోంది. నాయుడుపేటలోని రింగ్ రోడ్డు వద్ద వాహనం యాక్సిల్ రాడ్ విరిగిపోయింది. దీంతో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రవి, వినాయక గాయపడ్డారు. వారిని హైవే మొబైల్ పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వాహనాన్ని క్రేన్ సహాయంతో పక్కకు జరిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. వాహనంలో ఉన్న కోళ్ల చాలా వరకు మృతి చెందాయి.



బోల్తా పడిన టాటా ఏస్ వాహనం

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతంలోకి శుక్రవారం ఒక చుక్కల దుప్పి వచ్చింది. ఒక ఇంటి ఆవరణలో కొంత సేపు వుంది. వారు దాన్ని తరమడంతో కాంపౌండ్ వాల్ దూకి రాఘవయ్యపేటలోని చెంగాళమ్మ ఆలయం వెనుకకు వచ్చింది. ఈ లోపు స్థానికులు పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని దాన్ని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. వణ్యప్రాణులు తాగునీటి కోసం అడవుల నుంచి జనారణ్యంలోకి వస్తున్నాయని, వాటిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులు కోరారు.

యువకుడికి తీవ్ర గాయాలు

దక్కిలి: మండలంలోని లింగసముద్రం వద్ద శుక్రవారం టాటా మ్యాజిక్ వాహనం ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రాపూరు గ్రామానికి చెందిన కురాకు వెంకటేశ్వర్లు బోలేరో వాహనంలో గొర్రెలను గూడూరు సంతకు తీసుకెళ్లి విక్రయించాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. దక్కిలి మండలం లింగసముద్రం వద్ద రోడ్డుపై నిలబడి ఉండగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన టాటా మ్యాజిక్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును స్థానికులు 108లో రాపూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. ఎస్ఐ శివశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అభయశంకరునికి పౌర్ణమి పూజలు

సూళ్లూరుపేట : సూళ్లూరు పేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వున్న శ్రీ అభయశంకరుని ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. పూలంగి సేవ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పట్టణానికి చెందిన ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. బీసీ సంఘం నాయకులు చిట్టేటి పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆమోదం లేకుండానే పనులు

దక్కిలి: దక్కిలి పంచాయతీలో సర్పంచ్ ఆమోదం లేకుండానే పంచాయతీ కార్యదర్శి సీసీ రోడ్లు వేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి, వార్డు సభ్యుడు మునిరెడ్డి, మురళీరెడ్డి ఆరోపించారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న ఒక నాయకుడి ఇంటికి సీసీ రోడ్డు వేసేందుకు హడావుడిగా రాత్రి వేళలో వార్డు సభ్యులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో ఒక నాయకుడి ఇంటికి సిమెంట్ రోడ్డు వేయాలని ప్రయత్నించగా తాము ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. అప్పట్లో పనులు ఆపేశారని, ఇప్పుడు కొంత మంది వార్డు సభ్యుల సంతకాలతో అజెండాను తయారు చేసి రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ గిరిజన కులానికి చెందిన మహిళ కావడంతోనే పంచాయతీ కార్యదర్శి ఇలా చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే టీడీపీ నేతలు సర్వే నంబర్ 164–1లో ఉన్న పోరంబోకు భూమిలో 120 అంకణాలను ఆక్రమించుకుని లేఅవుట్ వేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అతనికి పంచాయతీ కార్యదర్శి మద్దతు ఇస్తున్నట్లు విమర్శించారు. సర్వేనంబర్ 164–2లో దక్కిలి బాలకృష్ణారెడ్డికి చెందిన సెటిల్‌మెంట్ భూమిలో టీడీపీ నేత ఇంటికి సీసీ రోడ్డు వేయడానికి తీర్మానించారని దుయ్యబట్టారు. దీనిపై జనవరి 3న ఎంపీడీవోకి ఫిర్యాదు చేశామని, రెవెన్యూ అధికారులు పనిని రద్దు చేశారని వివరించారు. మళ్లీ సీసీ రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోలాహలంగా హోలీ పండుగ





నాయుడుపేట టౌన్ : హోలీ వేడుకలు జరుపుకుంటున్న మార్వాడీలు, కోట: హోలీ సంబరాల్లో యువకులు

నాయుడుపేట టౌన్ : మండలంలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, మహిళలు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. పట్టణంలోని దర్గావీధి, బజారువీధి, మూకాంబిక వీధి, రాజగోపాలపురం, ఎల్ఏ సాగరం, పిచ్చిరెడ్డి తోపు, రావువారివీధి, బేరిపేట, ఆకుతోట వీధి, పిళ్లారిగుడివీధి తదితర ప్రాంతాల్లో హోలీ పండుగ జరుపుకున్నారు. స్వర్ణముఖి వద్ద అనేక మంది మార్వాడీలు హోలీకాదహన్ పేరుతో హోలీ రాక్షసి బొమ్మకు నిప్పంటించారు. స్థానిక రామ్‌దేవ్ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటలో..

కోట: కోటలో శుక్రవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. కోటలో రాజస్థాన్ వాసులు వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. వారు హోలీని ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బజారులో దుకాణదారులకు స్వీట్లు పంచిపెట్టారు.

గూడూరులో..

చిల్లకూరు : గూడూరులో శుక్రవారం హోలీ పండుగను రాజస్థానీయులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాపూరులో

రాపూరు: రాపూరులో శుక్రవారం హోలీ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పెద్దలు, చిన్నారులు రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు.



చిల్లకూరు : హోలీ వేడుకల్లో రాజస్థానీయులు

అన్నదానం

దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీకృష్ణ పరమాత్మ గీతా మందిరంలో శుక్రవారం 40వ గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. గురువారం రాత్రి మందిరంలో భజన చేపట్టారు. కార్యక్రమంలో సుందరయ్యస్వామి, శ్రీకృష్ణ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు



దొరవారిసత్రం : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నెల్లూరుపల్లి–రామారెడ్డికండ్రిగ, ఉచ్చూరు, సూరపు అగ్రహారం, కుమ్మరిగుంట, కేపీవీ కండ్రిగ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు ఎక్కువగా పెరిగాయి. ఎదురుగా వాహనం వస్తే ఇబ్బంది పడాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. రాత్రుల ఆదమరిస్తే ప్రమాదాలబారిన పడాల్సిందేనని వాపోతున్నారు. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.